మార్టిన్ వాల్సెర్

# 13. నాపైన ఆరోపణలు పెరుగుతున్నాయి

పట్టపగలు మెయిన్‌హాలులోకి జొరబడి బాంకు దోచడానికి ధైర్యం కావాలి. నా గురువులు నన్నేదైనా వృత్తి ఎన్నుకోమన్నప్పుడు నాకు అలాటి ధైర్యం లేక పోయింది. ఫారెస్టు వార్డెను కమ్మంటే సంతోషంగా అయిఉండేవాణ్ణి. కాని ఇందుకు కూడా బాంకుదొంగ కున్నంత ధైర్యమూ అవసరమని నాకు తోచింది. జాగ్రత్తగా పరిశీలించి చూసినట్టయితే దాదాపు ప్రతి ఉద్యోగానికీ బాంకుదొంగకున్నంత ధైర్యమూ కావాలి—హాలులోకి జొరబడి, గుళ్ళున్నదో లేనిదో ఒక పిస్తలుచూపి అందరినీ నిలవేసి, తనకు కావలసినదేదో పుచ్చేసుకుని, అంతచేసికూడా చిరునవ్వుతెచ్చుకుని, ఒక్కొక్క అడుగే వెనక్కు వేస్తూ, ఆకస్మికంగా మాయమయేవాడికుండే ధైర్యం!

కొసకి హాలుపోర్టరవుదామని నిశ్చయించాను. ఒక ఆటబొమ్మల ఫాక్టరీలో హాలుపోర్టరుగా కుదిరాను. ఈ వృత్తిలో ఉండే సోదరులు చాలా గర్వంగా తయారవు తారనీ, పని అయిపోయాకకూడా వాళ్ళ ముఖాలు చాలా గంభీరంగా ఉంటాయనీ, 'పొండి, పొండి' అన్నట్టుగా వాళ్ళు చేతులూపుతూ ఉంటారనీ నేను ఊహించగలను.

నేను నా డ్యూటీ నిర్దాక్షిణ్యంగానే కొనసాగించినప్పటికీ ఇలా మటుకు తయారు కాలేదు. నేను మొదటినుంచీ నా అద్దపు కిటికీ వెనక చక్కగా కుదురు కున్నాను. నా అధీనంలో ఉండే తలుపులు తెరవడానికి ఏ యే మీటలు నొక్కాలో ఒక్కసారే చెప్పారు, నాకు వెంటనే అంతా బోధపడిపోయింది. ఇంటర్నల్ టెలిఫోను లిస్టు పైనుంచి కిందికి చదివానో లేదో వెంటనే కంఠస్థమైపోయింది. తొలిగా వచ్చిన ఆగంతుకుల దగ్గర కాస్త కంగారు తిన్నమాట నిజమే. వాళ్ళడిగే దానికి సమాధానం చెప్పలేనేమోనని భయం; వాళ్ళకు కావలసిన విషయాలు వారికి అర్థమయే విధంగా చెబుతానో లేదోనని సంకోచం. నిజం ఆలోచించినట్టయితే హాలుపోర్టరు పనిలో అపజయం పొందడం ఎంత తేలిక! ఫాక్టరీలోకి గొప్ప

గొప్ప వాళ్ళంతా వస్తారు, పై అధికారి ఈ పెద్దమనిషిని చూడగోరుతాడో, ఆ పెద్ద మనిషిని చూడగోరుతాడో హాలుపోర్టరుకు తెలీదు. ఫాక్టరీలో ప్రతి ఒకడూ హాలుపోర్టరుకు పై అధికారి ననుకునేవాడేనాయె. హాలుపోర్టరుకు సహోద్యోగు లుండరు, పై అధికారులే తప్ప వారందరినీ తృప్తిపరచాలి. హాలుపోర్టరు చేసే దేమున్నది, టెలిఫోను తియ్యడమూ, ఆఫీసులో వాళ్ళను పిలవడమూ, ఫలానా వారిని పంపవచ్చునా, కూడదా అని అడగడమూ మాత్రమే గదా అని మీరనుకో వచ్చు. కాని ఆఫీసులో వాళ్ళు ఎంత సుకుమారంగా ఉంటారంటే, టెలిఫోనులో అడిగిన మాత్రానే వాళ్ళ నరాలు తెగిపోతాయి! అప్పుడు వాళ్ళు హాలుపోర్టరు మీద టెలిఫోనుకుండా విరుచుకుపడతారు, హాలుపోర్టరు బావురుమని ఏడవకుండా కష్టపడి నిగ్రహించుకోవలసి వస్తుంది. వా డలా ఏడవకూడదు, ఎందుచేతనంటే, కిటికీ అద్దానికి తల మోటించి, హాలుపోర్టరు కేసి ఆత్రంగాచూస్తూ ఆగంతుకుడు ఎదురుగానే ఉంటాడు; అతనికి వెంటనే ఏదో ఒక సమాధానం చెప్పాలి. అంతే కాదు, ఆఫీసులోని నరాలు తెగిన పెద్దజీతగాడు హాలుపోర్టరు చెవిలో పెట్టిన గావు కేక ఛాయలు, సమాధానంలో ఏమాత్రం స్ఫురించరాదు; పైపెచ్చు, ఆ నరాలు తెగిన మనిషి ఆవేశాన్ని క్షమాపణకోరే చిరునవ్వుకింద తక్షణమే మార్చెయ్యడం హాలుపోర్టరు పని; ఆ మర్యాదపూర్వకమైన ప్రక్రియతో వచ్చినవాడు ఎంతో సంతృప్తిచెంది, బయటికి వెళ్ళిపోతూ తాను వచ్చిన పని కాలేదన్న సంగతికూడా మరిచిపోవాలి. ఇదంతా ఇలా ఉండగా, ఆఫీసునుంచి వచ్చే క్రోధకంఠధ్వని ఆగంతుకుడికి వినపడకుండా తొక్కిపెట్టడానికి నేను రిసీవరు చేతిలో పెట్టుకుని, నా వెనక వేళ్లాడుతుండే నాకోటు మడతలకి నా తల వంచి దూర్చుతాను. ఎందుకంటే, ఆగంతుకు డెవరయేదికాక, అతన్ని అమర్యాదగా చూడరాదని ఉన్నతాధికారి నుంచి, సాక్షాత్తూ కామందునుంచే, ఉత్తరువున్నది. ఈ ఉత్తరువు అందరికీ వర్తించేదే అయినా, క్రియకు దాన్ని అమలు జరపవలసినవాడు హాలుపోర్టరే. ఈ ఉత్తరువును నే నెంతో సంతోషంతో అమలుచేశాను, ఎందుకంటే అన్ని ఆఫీసు ఉత్తరువులలోకీ నాకు హెచ్చుగా సమ్మతమైనది ఇదే.

ఆ కారణంచేత నేను చీటికీ మాటికీ టెలిఫోనుకేసి చెయ్యిచాచే అలవాటు తగ్గించాను. దానికి మారుగా, ఆగంతుకులను నేనే పరీక్షించి, ప్రధాన కొనుగోలుదారు తోనో, హెడ్‌గుమస్తాతోనో, డిజైను మేనేజరుతోనో, కాంటీన్ యజమానురాలి

తోనో, ఆఖరుకు ఎవరైనా డైరెక్టరుతోనో, పర్సనెల్ ఆఫీసరుతోనో మాట్లాడాలన్న వారి కోరిక సమంజసమైనదో, కాదో నిర్ణయిస్తాను.

ఒకవేళ ఆరంభంలో కొంతమందిని నేను తొందరపడి పంపేసి ఉండవచ్చు. కాని కాలక్రమాన నేను మహా యుక్తిగా ప్రశ్నలడిగే శక్తి అలవరుచుకున్నాను—చాలా నమ్రతగా, డిటెక్టివులూ, కూపీలుతీసేవాళ్ళూ ప్రశ్నించినట్టు ఎంతమాత్రమూ కాకుండా, యాదాలాపంగా, ఉభయపక్షాలకూ ఉత్సాహకరంగా ఉండే విధంగా సంభాషణ నడుపుతూనే అవసరమైన విషయాలన్నీ రాబట్టి, చిట్టచివరకు, ఆ వచ్చినవాడి పని ఫాక్టరీకి ఎంతవరకు ప్రయోజనకరమైనదీ నేనా మనిషిని అంతఃకరణ శుద్ధిగా పంపేసేటందుకు అవకాశమున్నదీ, లేనిదీ, తూచినట్టు నిర్ణయించుకోగలిగే వాణ్ణి. హెచ్చుమందిని పంపెయ్యడమే జరుగుతుంది గనక, ఎవరినన్నా పంపేసేటప్పుడు, ఆ మనిషి తాను చూడవచ్చినవాణ్ణి చూడడం శుద్ధదండుగ అని సంభాషణ ద్వారా అతనికి నమ్మకం కుదిరేలాగా చెయ్యడం నాకు తెలుసు. నాకు మా వ్యాపారాలను గురించి ఎంత బాగా తెలుసునంటే, ఎవరైనా తగరపు రేకును సప్లయిచేసే సందర్భంలో మా ప్రధాన కొనుగోలుదారుతో మాట్లాడాలని దూరంనుంచి వస్తే, అతని పని జరిగేదీ, లేనిదీ కచ్చితంగా చెప్పగలను. అలాగే, ఎవరైనా చిల్లర వర్తకుడు సేల్స్ మేనేజరును చూస్తానని వచ్చినా, ఒక్క రైతు మా కాంటీనుకు సప్లయిలుచేస్తానని వచ్చినా, కొత్తరకం ఆటవస్తువులను కనిపెట్టే వాళ్ళు ముగ్గురేసిగానూ, నలుగురేసిగానూ వచ్చి, మా డిజైన్స్ డిపార్ట్‌మెంట్ మేనేజరును ఎలాగైనా పట్టుకొని, తమ చెత్తనమూనాలు అంటగట్టడానికి వచ్చినా వాళ్ళకు తృప్తికలిగించే నేర్పు సంపాదించాను. తమకు వ్యతిరేకసమాధానాలిస్తూ ఉత్తరాలు రాసిన మా పబ్లిసిటీ మేనేజరు మీద పగ తీర్చుకోవడానికి శివమెత్తివచ్చే రచయితలను, పేంటర్లనూ కూడా నేను కొంతవరకు నిగ్రహించగలను. నిజానికి, మంచిగా చెబితే విననిది వీళ్ళే — బక్కరైతులూ, దూరప్రయాణీకులూ ఇంత అన్యాయం కాదు, ఏ మాట కా మాటే చెప్పాలి.

ఈవిధంగా నేను ప్రవేశద్వారం వద్ద కంపెనీలోని ముఖ్యులందరికీ ప్రాతినిధ్యం వహిస్తాను (ఇంకెలా చెప్పడం ?); లాభాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయంటే: నేను మా కంపెనీ మనుష్యులందరినీ చికాకుపెట్టే ఆగంతుకుల నుంచి కాపాడుతున్నా నన్నది అందుకు తక్కువైన కారణమేమీ కాదు; దుర

దృష్టవశాత్తూ ఆ పెద్దమనుష్యులు ఏమాత్రమూ ఆ సంగతి గ్రహించరు. వచ్చిన ప్రతివాడికీ అతని రాక నిరర్థకమని మంచిగా నచ్చజెప్పడానికి కొంతకాలం పడు తుందన్న విషయం వాళ్లు మొదలే అర్థంచేసుకోరు. కొందరు మొండివాళ్ళతో విసుగెత్తే సంభాషణలు దీర్ఘంగా జరపవలసి వస్తుంది. అందుచేత పని ప్రారం భించడానికి అరగంట ముందునుంచే నా కిటికీ అవతల పెద్ద క్యూ ఏర్పడి, క్షణ క్షణమూ పెరిగిపోతుంది. ఆ వచ్చిన వాళ్ళలో ఒక అమర్యాదస్తుడు జనంచాటున నాకు తెలియకుండా లోపల జొరబడ యత్నించాడని ఏమిటి, కంపెనీ ముఖ్య భాగస్వాములలో ఎవరో తొందరగా బయటికి వెళ్ళబోతే, క్యూలోని జనంమూలాన ఒకక్షణం జాప్యం జరిగిందని ఏమిటి, ఆగంతుకుల విషయంలో నేను అనుసరించే పద్ధతులను గురించి ఆరోపణలు పెరిగిపోతున్నాయి. నేను మందకొడిగానూ, అసమర్థంగానూ, అశాస్త్రీయంగానూ పని చేస్తున్నానంటున్నారు. ఈ ఆరోపణలుచేసే వారికి కొంచెం కూడా ఆలోచనలేదు, నేను చేసే పనిగురించి వారికి బొత్తిగా ఏమీ తెలీదు, అందుచేత వాళ్ళకు ఏమని సమాధానం చెప్పాలో కూడా నాకు తెలియకుండా ఉన్నది. వచ్చిన వాళ్ళమీద నేను కసురుకుని, చప్పున తెమిల్చేస్తే ఏమవుతుందో తెలుస్తుంది. అప్పుడు రిసెప్షను హాలులో ఒక్క పురుగుండదు, నిజమే; కాని అంతమాత్రం చేత మేనేజర్ల ఆఫీసుల్లో టెలిఫోనుకు ఫిర్యాదులతో విశ్రాంతి ఉండదు, కంపెనీకి గల మంచి పేరు కాస్తా పోతుంది, లాభాలు దిగదీస్తాయి. ఆగంతుకులకు ఆగ్రహం తెప్పించవద్దన్న ఆఫీసు ఉత్తరువు అర్థంలేనిదేమీ కాదు. నేనేమో మేనేజింగు డైరెక్టరు వద్దకు వెళ్ళి, నా మీద ఆరోపణలు చేసేవాళ్ళను నోరుమూసుకోమనమని చెప్పలేను గదా. ఉత్తరువులను పాటిస్తూనే పని చురు కుగా చెయ్యమని ఆయన నన్ను హెచ్చరిస్తాడు. కాని పని చురుకుగా చేసే టట్టుంటే, ఆఫీసులో వాళ్ళెవరూ మిమ్మల్ని చూడరని వచ్చినవాళ్లని మంచిగా నమ్మించే దెలా? లాటరీలో నీకు మొదటి బహుమానం వచ్చిందని చెప్పి ఒకరినైనా ఒక్కమాటతో నమ్మించవచ్చు; కాని, నీ ఉద్దేశం, లేక నీ ఎడ్వర్టయి జ్మెంట్ కాపీ, లేక నీ తగరపు రేకు, లేక నీ కూరలు ఈ సంస్థకు అవసరం కావు అని ఆ మనిషికి నచ్చేటట్టు చెప్పి, ఆ మనిషి ఈ సంస్థను దీవిస్తూ వెళ్ళి పోయేలాగా చెయ్యడానికి నా విమర్శకులను యత్నించమనండి, రెండు నిమిషాలు సైమిస్తాను. మరి నే నేం చేసేది?

నా కిటికీ వెలపల క్యూ రోజురోజుకూ పెరిగిపోతున్నది. అందువల్ల నాకు గల ప్రమాదం తెలుసు గనుక నేను మరింత కంగారుపడిపోతున్నాను: వెనకటి లాగా కాక, నా వాగ్ధోరణి దెబ్బతింటున్నది; చెమటలుపట్టి, మాట తడబడి, వెనక జనాన్ని నమ్మించినట్టుగా నమ్మించలేకపోతున్నాను; వచ్చినవాళ్ళలో కొందరు నన్ను తిట్టి, తలుపు దభాల్న మూసి, కోపంగా వెళ్ళిపోతున్నారు. నేనేం చేసేది? నా చేతిలో ఏమీలేదు. నా ఉద్యోగం గురించి ఇంత వివరంగా ఎందుకు రాస్తున్నానో ఇక బయటపెట్టవచ్చు. అది కేవలమూ నన్ను నేను సమర్థించుకునేటందుకే, ఎక్కడో అక్కడ, అధమం మా ఫాక్టరీ బయట అయినాసరే, ఎవరైనా అర్థం చేసుకుంటారని. ఎందుకంటే, రేపు నన్ను వెళ్ళి పర్సనెల్ మేనేజరును చూడ మన్నారు. ఏదో హెచ్చరింపు, ఒకవిధమైన బెదిరింపు అయిఉంటుందని మొదట అనుకున్నాను. నిన్న నా కిటికీ బయట క్యూలో నిలబడిన ఒక మొరటువాడు, సన్నని పెదిమలవాడు, తాను వచ్చినట్టు మేనేజింగు డైరెక్టరుకు తెలపమని నన్నా జ్ఞాపించాడు; తనను రమ్మన్నారన్నాడు. నా చెయ్యి టెలిఫోనుమీదికి పోతూండగానే అడిగాను, మేనేజింగు డైరెక్టరుతో నీకు గల పని ఏమిటని. హాలుపోర్టరు కావాలని ఎడ్వర్టయిజ్ చేశారుట, తను దరఖాస్తు పెట్టానన్నాడు.

పర్సనెల్ డిపార్ట్‌మెంట్ నంబరు ఏ పొరపాటూ లేకుండానే డయిల్ చేశాను. కాని మరుక్షణమే నా చూపుడువేలు పడిపోతున్నదానిలాగా వాలిపోయింది.

వాడు ఆఫీసుభవనంలోకి వెళ్ళి, అరగంట తరవాత మంచి ఉత్సాహంగా తిరిగి వచ్చాడు. వాడి ఉత్సాహం ఈలపాటదాకా వెళ్ళింది. వాడు వెళ్ళుతుంటే చూస్తూ వాణ్ణి మెచ్చుకున్నాను. ధైర్యమంటే అలా ఉండాలనుకున్నాను. ఏమైనా ధైర్యం అవసరం. ఇన్నాళ్ళూ నేను, చేసేది హాలుపోర్టరుపనే గదా అని కొంతలో కొంత సిగ్గుపడుతూ వచ్చాను. అందుకు కూడా బాంకులు దోచేటంత ధైర్యంకావా లని నా కర్థమయింది. నాలో అదే లేకుండా ఉంది.